సాక్షి మంచిర్యాల

శుక్రవారం : 29 : నవంబర్ : 2024



ఔరా..బాల మేధావులు

ఆసిఫాబాద్‌లో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలకు చెందిన 500 మంది విద్యార్థులు 358 ప్రాజెక్టులు ప్రదర్శించారు.

8లో▸



జ్యోతిబా పూలేకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

9లో▸

గరిష్ఠం/కనిష్ఠం 28.0 /17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఏసీపీ

కోటపల్లి: మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని పార్‌పల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న మూడు దశాబ్దాలుగా మావోయిస్టుల్లో కొనసాగుతుండగా.. గురువారం గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులను ఏసీపీ కలిశారు. నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఏసీపీ మాట్లాడుతూ ఆత్రం లచ్చన్న లొంగిపోతే ఆయనపై ఉన్న రూ.8లక్షల రివార్డు, ప్రభుత్వ పరంగా అన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, కానిస్టేబుల్ రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

చెన్నూర్: కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, పెండింగ్ కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయద్దని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం చెన్నూర్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రజాపాలన విజయోత్సవం

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవం ఈ నెల 30న మధ్యాహ్నం 3గంటలకు మంచిర్యాలలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క హాజరవుతారని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన జరిగే సమావేశానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు క్వారీలో ట్రెక్కింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న మంచిర్యాల ఎంసీసీ క్వారీలో, 30న గాంధారీ ఖిల్లా వద్ద ట్రెక్కింగ్(హైకింగ్) నిర్వహించనున్నట్లు లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్ తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ ట్రెక్కింగ్‌లో మొదటి 30 మందికి రూ.100 ప్రవేశ రుసుంతో పాల్గొనే అవకాశం కల్పిస్తుండగా.. 12ఏళ్లలోపు పిల్లలు తల్లిదండ్రులు, శిక్షకులతో రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు బీట్ అధికారి రాజేందర్‌ను 9948805488 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'డేటా ఎంట్రీ పేరుతో బెదిరింపులు సరికాదు'

కోటపల్లి: ప్రభుత్వ ఆదేశాలు లేకున్నా కొందరు అధికారులు పాఠశాల విధుల అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి కులగణన సర్వే డేటా ఎంట్రీ విధులు నిర్వర్తించాలని ఉపాధ్యాయులను బెదిరించడం సరికాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. గురువారం దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గణాంకశాఖ నిర్వహించాల్సిన విధులు కూడా ప్రభుత్వ ఉద్యోగులపై రుద్దడం సరికాదని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వం నెలరోజులు సర్వే పేరుతో పాఠశాలకు దూరం చేసిందని, దీంతో సిలబస్‌పై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. ఇది పరోక్షంగా ప్రైవేట్ పాఠశాలలకు మేలు చేయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన సర్వే విధులు నిర్వర్తించిన వారికి వెంటనే గౌరవ వేతనం, సీసీఎల్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, లింగయ్య, గోపిచందర్ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు స్పందన

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సైన్స్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు మండలాల నుంచి 84 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రశ్నపత్రాన్ని మండల విద్యాధికారి మాళవీదేవి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు విడుదల చేశారు. పరీక్ష అనంతరం విజేతలను ప్రకటించారు. విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపిక కాగా జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిష్టయ్య, మోటివేషనల్ స్పీకర్, సింగరేణి డెప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్, సింగరేణి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేందర్ పాల్గొన్నారు.

అడవిలో కలప దొంగలు



తానిమడుగు అడవిలో నరికివేతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్(ఫైల్)

- టేకు చెట్లు నరికివేత
- రాత్రికి రాత్రే అక్రమంగా తరలింపు
- కవ్వాల్ అభయారణ్యం నుంచే రవాణా
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అటవీ శాఖ అధికారులు



ప్రాణహిత నది నుంచి అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్న అధికారులు(ఫైల్)

మంచిర్యాలక్రైం: అటవీ సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టాలు చేసింది. అటవీ ప్రాంతం నుంచి చీపురు పుల్ల కూడా బయటకు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసింది. ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా కంచె కొట్టించడం, 24గంటలూ బేస్‌క్యాంపు సిబ్బంది కాపలా, ఉన్నతాధికారుల సమాచార వ్యవస్థ వంటి చర్యలు చేపడుతోంది. అక్రమంగా కలప తరలిపోకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలూ జారీ చేసింది. అయినా కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. కలప దొంగలు యథేచ్ఛగా దందా కొనసాగిస్తూ రెచ్చిపోతున్నారు. అటవీ అధికారులపై దాడులకూ వెనుకాడడం లేదు. కొన్ని సందర్భాల్లో స్మగ్లర్లను అడ్డుకునేందుకు అటవీ అధికారులు వెనుకంజ వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన మేధాన్ని అరికట్టడంలో ఆ శాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో అడవుల పరిస్థితి ఇదీ..

అడవిలో చెట్ల నరికివేత ఆగడం లేదు. ఎక్కోడో ఓ మూలన స్మగ్లర్లు చెట్లను నరుకుతూనే ఉన్నారు. రంపాలతో చెట్లను మొదలు వరకు కోస్తూ కనిపించకుండా మట్టితో పూడ్చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం 2019 సర్వే లెక్కల ప్రకారం 5,721.32 చదరపు కిలోమీటర్లు 35.53శాతం ఉండగా.. 2021 సర్వే ప్రకారం 5,743.42 చదరపు కిలోమీటర్లలో 35.66శాతం విస్తరించింది. ఉమ్మడి జిల్లా పరంగా చూస్తే స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది. కానీ కవ్వాల్ అభయారణ్యంలో 2011 సర్వే లెక్కల ప్రకారం 1,825.85 చదరపు కిలోమీటర్లు ఉండగా.. 2022 సర్వే లెక్కల ప్రకారం 1,706.88 చదరపు కిలోమీటర్లు ఉంది. 2011–22 మధ్య కాలంలో 118.97 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం పడిపోయినట్లు ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ) ఆ శాఖ కేంద్ర మంత్రి విడుదల చేసిన గణాంకాలు తెలియజేశాయి. ఉమ్మడి జిల్లాలో అటవీ విస్తీర్ణం స్వల్పంగా పెరుగగా.. కవ్వాల్ అభయారణ్యంలో తగ్గిపోవడంతో జిల్లా అటవీ అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలో నమోదైన కేసులు

సంవత్సరం	ఓఆర్ కేసులు	పట్టుబడిన కర్ర(క్యూబిక్ మీటర్లు)	యూడీఓఆర్ కేసులు	పట్టుబడిన కర్ర (క్యూబిక్ మీటర్లు)
2021–22	464	26.965	292	47.963
2022–23	269	13.281	178	28.314
2023–24	426	24.411	171	22.598

తరలిపోతోందిలా..

జిల్లాలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం జన్నారం మండలం కవ్వాల్, దేవునిగూడెం, కొత్తూర్‌పల్లి, అల్లీనగర్, మల్యాల, తపాల్‌పూర్, దొంగపల్లె గ్రామాల నుంచి కలప తరలిపోతోంది. చింతగూడెం, రోటిగూడెం, తపాలపూర్ గ్రామాల మీదుగా గోదావరి నది దాటిస్తున్నారు. చెన్నూర్ సబ్ డివిజన్‌లోని కోటపల్లి, నీల్వాయి రేంజ్ పరిధిలో కలప అక్రమ రవాణా ప్రాణహిత సరిహద్దు ప్రాంతంలో యథేచ్ఛగా తరలిపోతోంది. చెన్నూర్, జన్నారం డివిజన్లలో అధికారులు స్థానికంగా ఉండకపోవడమే కలప అక్రమ రవాణాకు కారణంగా తెలుస్తోంది. గత ఏడాది అక్టోబర్‌లో జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు బదిలీ తర్వాత ఇప్పటివరకు ఎవరినీ నియమించ లేదు. జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో పర్యవేక్షణ కరువైందనే ఆరోపణలున్నాయి. కోటపల్లి, నీల్వాయి రేంజ్‌లో కొందరు అధికారులు ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారు. కలప స్మగ్లర్లతో దోస్తీ కట్టి వారి కనుసన్నల్లోనే దందా సాగిస్తున్నట్లు సమాచారం. కలమడుగు, కమ్మార్ సమీపంలోని గోదావరి వంతెన మీదుగా జగిత్యాల, తపాలపూర్, దండేపల్లి, మ్యాదరిపేట, లింగాపూర్, దమ్మన్నపేట, తాళ్లపేట, తానిమడుగు, మాకులపేట గ్రామాల మీదుగా మంచిర్యాలకు కార్లలో తరలిస్తున్నారు. జిల్లాలో కలప అక్రమ రవాణాపై జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ వివరణ కోసం సంప్రదించగా స్పందించలేదు.

ఈ ఏడాది పట్టుబడిన కలప

- జూలైలో కోటపల్లి రేంజ్ పరిధి ఆలుగామ ప్రాణహిత నది గుండా అక్రమ కలప మోడెలు కట్టుకుని తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు 50దుంగలు స్వాధీనం చేసుకున్నారు. కలప దొంగలతో దోస్తీ కట్టి 20దుంగలు పట్టుబడినట్లు చూపించారు. మిగతా 30దుంగలను వదిలిపెట్టిన ఘటన అప్పట్లో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది.
- ఆగస్టు 11న కవ్వాల్ టైగర్‌జోన్ పరిధి జన్నారం రేంజ్ అలీనగర్ గ్రామంలో ఆత్రం నగేష్ ఇంట్లో అక్రమంగా టేకు కలపతో తయారు చేసిన రూ.54వేల విలువైన ఫర్నిచర్ అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోర్ ఏరియాలో అక్రమంగా ఫర్నిచర్ దందా సాగడం చర్చనీయాంశమైంది.
- సెప్టెంబర్ 23న జన్నారంలోని శ్రీలంక కాలనీలో అక్రమంగా నిల్వ ఉన్న రూ.14వేల విలువైన టేకు కర్రను స్వాధీనం చేసుకున్నారు.
- అక్టోబర్ 2న తాళ్లపేట అటవీ ఊట్ల బీట్ పరిధిలో అటవీ శాఖ అధికారులు వెంబడించి రూ.34వేల విలువైన మూడు టేకు సైజులు, 8వాసాలు పట్టుకున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నెన్నెల: నిబంధనలు ఉల్లంఘించి వాగులు, వంకల నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఖర్జీ–జంగాల్‌పేట ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ట్రాక్టర్ల పత్రాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రకారంగా తరలిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే ట్రాక్టర్లను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గొల్లపల్లి, నెన్నెల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలించారు. గొల్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంటశాల, ఆహార నిల్వలు, గదులు, పరిసరాలు, రిజిష్టర్లు పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, శుద్ధమైన తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. తహసీల్దార్ రమేష్, ఆర్ఐ సులోచన, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం సేకరించిన రైతుల ఖాతాల్లో మూడు రోజుల వ్యవధిలో నగదు జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం కొందరు రైతులు తమ ఖాతాల్లో నగదు జమ కావడంతో కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావుతో కలిసి కలెక్టర్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ధరల పెంపు

- ఏజెన్సీలకు కాస్త ఊరట
- నిధుల మంజూరులో జాప్యంపై అసంతృప్తి



గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న కార్మికులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం ఏజెన్సీలకు కాస్త ఊరటనిస్తోంది. సర్కారు బడుల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులు మధ్యాహ్నం పస్తులు ఉండకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అమలు చేస్తున్న ధరలు సరిపోవడం లేదని, నిధులు పెంచాలని వంట ఏజెన్సీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. ప్రభుత్వం పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేస్తుండగా.. కూరగాయలు, కోడిగుడ్లు ఏజెన్సీల నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మెనూ ప్రకారం పాఠశాలల్లో పని దినాల్లో ఆరు రోజుల్లో మూడు రోజులు కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనం వంట ధరలను పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40శాతం భరిస్తాయి. పెంచిన ధరలు డిసెంబర్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల తర్వాత మధ్యాహ్న భోజనం వంట ధరల పెంపుతో ఏజెన్సీలకు కాస్త ఊరట కలిగించింది.

747 పాఠశాలలు..

జిల్లాలోని 747 ప్రభుత్వ పాఠశాలల్లో 37,241మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం అందించే కార్మికులు 1,249మంది ఉన్నారు. ఇప్పటివరకు వంట ఏజెన్సీ మహిళలకు ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు ఒక్కొక్కరికి రూ.5.45 చెల్లిస్తుండగా.. రూ.6.19కి పెంచారు. ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.8.17చొప్పున చెల్లిస్తుండగా.. రూ.9.29కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మధ్యాహ్న భోజనానికి రాష్ట్ర ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తుంది. కూరల కోసం పప్పు, కూరగాయలు, నూనె వంట ఏజెన్సీ మహిళలు సమకూర్చుకుంటారు.

నిధుల మంజూరులో జాప్యం..

మధ్యాహ్న భోజన ఏజెన్సీ వంట ధరలు అంతంత మాత్రమేనని వంట కార్మికులు చెబుతున్నారు. నెలనెలా బిల్లులు, గౌరవ వేతనం కూడా సక్రమంగా చెల్లించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నెలకు ఒకటి నుంచి 5వ తరగతి వరకు కుకింగ్ కాస్ట్ రూ.18,68,657, 6నుంచి 8వ తరగతి వరకు రూ.6,22,888 చెల్లిస్తుంటారు. కుక్ కమ్ హెల్పర్‌కు రూ.1000 చొప్పున రూ.13,27,997, 9నుంచి 10వ తరగతి వరకు జనరల్ విద్యార్థులకు రూ.10,98,448, ఎస్సీలకు రూ.7,16,941, ఎస్టీలకు రూ.1,02,769 కుకింగ్ కాస్ట్ చెల్లిస్తున్నారు. ఇందులో 1నుంచి 5వ తరగతి వరకు కుకింగ్ కాస్ట్ సెప్టెంబర్ వరకు చెల్లించగా ఒకనెల పెండింగ్‌లో ఉంది. 6నుంచి 8వ తరగతి వరకు కుకింగ్ కాస్ట్ ఆగస్టు వరకు, 1నుంచి 8వ తరగతి వరకు గుడ్డు డబ్బులు ఆగస్టు వరకు, 9నుంచి 10వ తరగతి వరకు కుకింగ్ కాస్ట్ ఆగస్టు వరకు చెల్లించారు. ఈ లెక్కన రెండు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. 1నుంచి 8వ తరగతి కుక్ కమ్ హెల్పర్ గౌరవ వేతనం(రూ.1000) ఆగస్టు వరకు చెల్లించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు నెలనెల తరబడి మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అసలే పెంచిన ధరలు అంతంత మాత్రమే అయినా సకాలంలో చెల్లిస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

ఉపాధి కల్పించేలా..!

- ఔత్సాహిక రైతులకు అవకాశం
- వ్యవసాయ అనుబంధ రంగాలకు 50శాతం రాయితీ



ఫారంలో జీవాలు

దండేపల్లి: వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు పెంచేందుకు కేంద్రం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం ప్రవేశపెట్టింది. వ్యక్తిగతంగా ఉపాధి అవకాశం కల్పించేలా, రైతులు, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు 50శాతం రాయితీ ఇస్తోంది. ఇందుకు చాలామంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందులో పాడిపరిశ్రమతోపాటు జీవాల పెంపకం, దేశీయ కోళ్ల ఉత్పత్తికి అవకాశం ఉంది. జిల్లాలో మాత్రం జీవాల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జీవాల పెంపకానికి రూ.కోటి

వ్యవసాయ భూములున్న రైతులు, గొర్రెలు, మేకలు పెంచుకునేందుకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద రూ.కోటి వరకు రుణం పొందే వీలుంది. ఇందులో 50శాతం రాయితీ అందనుంది. ఈ పథకం ద్వారా జీవాలు పెంచుకునేందుకు వ్యవసాయ భూములను ముడి పెట్టింది. ఐదెకరాల భూమి ఉన్న రైతులకు రూ.కోటి వరకు, నాలుగు ఎకరాలు ఉంటే రూ.80లక్షలు, మూడెకరాలు ఉంటే రూ.60లక్షలు, రెండెకరాలు ఉంటే రూ.40లక్షలు వరకు రుణం పొందవచ్చు. లబ్ధిదారులు వాటా ధనం కింద పది శాతం చెల్లిస్తే మిగతా 40శాతం రుణం మంజూరు చేస్తుంది. మిగతా సగం రాయితీ రూపంలో కేంద్రం వర్తింపజేస్తుంది.

ఇప్పటి వరకు 45 దరఖాస్తులు



ఈ పథకం కింద ఇటీవల జిల్లాలో 45మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో నలుగురు మాత్రమే అర్హత సాధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తప్పులు ఉండడంతో తిరస్కరణకు గురవుతున్నాయి. దరఖాస్తులను మరోసారి చూసుకుని తప్పులు ఉంటే సరిచేసి పంపించుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి రాష్ట్రస్థాయిలో అర్హత సాధిస్తే కేంద్రానికి పంపిస్తాం. వారికి మాత్రం 50శాతం రాయితీ వర్తిస్తుంది. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలి.

– శంకర్, జిల్లా పశుసంవర్ధక అధికారి

ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత

- పెండింగ్ కేసులు పరిష్కరించాలి
- మంచిర్యాల డీసీపీ భాస్కర్



కన్నెపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్

భీమిని: ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. గురువారం కన్నెపల్లి, భీమిని పోలీస్‌స్టేషన్లను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని అన్నారు. ప్రమాదాల నివారణకు రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమరవాణాను నియంత్రించాలని తెలిపారు. జవాబుదారీగా ఉంటూ బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలని చెప్పారు. సిబ్బందికి ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కన్నెపల్లి మండలంలో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సైలు గంగారాం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ఆర్టీసీలో వనభోజనాలు



భోజనం వడ్డిస్తున్న ఆర్ఎం సోలామాన్

మంచిర్యాలఅర్బన్: నిత్యం బస్సుల్లో ప్రయాణికులను చేరవేస్తూ బిజీ బిజీగా గడిపే కార్మికుల కోసం మంచిర్యాల ఆర్టీసీ డిపోలో కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. గురువారం డిపోలో ఉద్యోగులు, అధికారులు ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఆదిలాబాద్ ఆర్ఎం సోలామన్ స్వయంగా భోజనం వడ్డించారు. మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్, టార్గెట్ బాల్స్‌తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఎం) ప్రవీణ్, డిప్యూటీ ఆర్ఎం(ఓ) ప్రణీత్, డీఎం జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్ దేవపాల పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రజలకు కుటుంబ నియంత్రణపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుటుంబ నియంత్రణ అవగాహన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వచ్చే నెల 4వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సహకారంతో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కుటుంబ నియంత్రణకు నోటిమాత్రలు, ఐయూడీ నిరోధ్ ఎమర్జెన్సీ, అంతరా ఇంజక్షన్ వంటి తాత్కాలిక పద్ధతులపై వివరించాలని తెలిపారు. కుటుంబ నియంత్రణ శిబిరాలు ఏర్పాటు చేయాలని, పిల్లలు కలిగిన వారిలో మగవారికి వ్యాసెక్టమీ, ఆడవారికి ట్యూబెక్టమీలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుధాకర్ నాయక్, అనిత, ప్రసాద్, కృపాబాయి, కాంతారావు, పద్మ, బుక్క వెంకటేశ్వర్, దామోదర్ పాల్గొన్నారు.

30న బెల్లంపల్లిలో కిసాన్ మేళా

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఈ నెల 30న కిసాన్‌మేళా నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కేవీకే ప్రాంగణంలో ఉదయం 9గంటలకు మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. బెల్లంపల్లి కేవీకే, జాతీయ పత్తి పరిశోధన సంస్థ, నాగ్‌పూర్ వ్యవసాయ సాంకేతిక ప్రయోగ పరిశోధన సంస్థ(అ టారి, జోన్–10) సంయుక్తంగా కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల, కుమురం ఆసిఫాబాద్ జిల్లాల రైతులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: జీవితంపై విరక్తితో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం.. సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన నలిమెల కాంతయ్య(43) ఇటీవల దుబాయ్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక నెలక్రితం స్వదేశానికి తిరిగివచ్చాడు. ఈనెల 25న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. జిల్లాకేంద్రం శివారులో స్థానికుడు గురువారం బహిర్భూమికి వెళ్లగా కాంతయ్య ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి ఫోన్‌ను పరిశీలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వ్యవసాయంలో లాభాలు రాక, దుబాయిలో పని దొరకక జీవితంపై విరక్తితో కాంతయ్య ఉరేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తిర్పెల్లి సమీపంలో చిరుత పులి

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి సమీపంలో గురువారం సాయంత్రం చిరుత పులి కలకలం రేపింది. లక్ష్మణచాందకు చెందిన రైతు అట్ల రాంరెడ్డి కొరిటికల్ నుంచి వస్తుండగా చిరుత పులి కనిపించింది. అది కిందకు దిగి పసుపు పంటలోకి వెళ్లిందని తిర్పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని చాటింపు వేయించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి గురువారం తనిఖీ చేశారు. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీకి సీఐ సైదారావు, ఎస్సై రాహుల్‌తోపాటు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ నిర్వహించి, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయంతోపాటు ఎస్సై కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ప్రజ లు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీసుల ను సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు. పోలీసులు ప్రజలతో మమేకం అవ్వాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయికుమార్, శంకర్, కృష్ణసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఔరా..బాల మేధావులు

- చిన్నారులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు
- ఆసిఫాబాద్‌లో రెండురోజులు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుంది. విద్యతోపాటు పరిశోధన, ప్రయోగ సామర్థ్యాలు మెరుగుపర్చి భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా తయారు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యర్థ పదార్థాల నిర్వహణ, వనరుల వినియోగం, విపత్తు నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం అంశంపై జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గురువారం ఈ వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీఈవో యాదయ్య ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి 500 మంది చిన్నారులు పాల్గొన్నారు. మొత్తం 358 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేలా ప్రదర్శన ఇచ్చారని తెలిపారు. సైన్స్ ఇష్టపడి చదివినవారు తమ సృజనతో పలు సమస్యలకు త్వరగా పరిష్కారం చూపగలగుతారన్నారు. నేను సైన్స్, గణితంలో 100కు 100 మార్కులు తెచ్చుకున్న విద్యార్థిని అని తెలిపారు. చిన్నారులను భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రతిభ చాటాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ ఢిల్లీ సీనియర్ అసోసియేట్ శుభదీప్ బెనర్జీ, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్, నిర్వహణ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బియ్యం శుద్ధి చేసే యంత్రం



బియ్యం వడే సమయంలో పెద్దపాత్రల్లో కట్‌గిర్ సాయంతో తిప్పుతూ వంట చేస్తారు. ఈ యంత్రంతో స్టాడ్ తయారు చేసి సైకిల్ చక్రంతో తిప్పితే సరిపోతుంది. బియ్యం శుద్ధితోపాటు పురుగులు, చెత్త నీటిలో తేలుతుంది. దీని తయారీకి రూ.1500 ఖర్చవుతుంది. – శేషాక్, సాంఘిక సంక్షేమ గురుకులం, ఆసిఫాబాద్

వ్యర్థాలతో డెకరేషన్



వ్యర్థాలతో ఇంటిలో మంచి డెకరేషన్ ఫ్లవర్ల వెరైటీలను తయారు చేసి ప్రదర్శించాను. పగిలిన అందం, ప్లాస్టిక్ బాటిల్‌తో బొకే, పడేసిన పేపర్‌తో డెకరేషన్ తయారీ చేశాను. పత్తి, సుతిల్ తాడు ఉపయోగించి, పేపర్‌తో సీతాకోక చిలుక తయారు చేసి ప్రదర్శించాను.
– నిహారిక, సిర్పూర్(టి) కేజీబీవీ

కరెంట్ లేకుండానే బావి నీరు



కరెంట్ మోటారు, సోలార్‌తో బావి, బోరు నీటితో పంటలు పండిస్తారు. ఎలాంటి మోటారు లేకుండా బావి నీరు బయటకు వచ్చేలా ప్రయోగం చేశాను. రెండు వాటర్‌డబ్బాలు తీసుకుని వాటికి పైపులు అమర్చి మధ్యలో ఉన్న డబ్బాలో సగం వరకు నీరు నింపాను. కింద ఉన్న ట్యాప్‌ను ఒపెన్ చేస్తే నీరు కింది వస్తుంది. పోసిన నీరు ఖాళీ అయిన వెంటనే పీడనంతో బావి నీరు బయటకు వస్తుంది.
– శ్రీవాణి, అంజలి, గన్నారం పాఠశాల, కాగజ్‌నగర్

ఇంటిపై కూరగాయల సాగు



ఇంటిపై హైడ్రో ఫోనింగ్‌తో కూరగాయల సాగు చేసుకోవచ్చు. పట్టణంలో ఖాళీ స్థలం ఉండదు. ప్లాస్టిక్ పైపుల్లో నీటిలో న్యూట్రిషన్ కలిపి సాగు చేసుకోవచ్చు. మందుల పిచికారి చేయాల్సిన అవసరం లేకుండా సాగు విధానాన్ని ప్రదర్శనలో చూపించాను.
– అత్విక్, రవీంద్రనగర్, మం.చింతలమానెపల్లి

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో గురువారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–17 విభాగంలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటినవారిని ఎంపిక చేశారు. డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంఈవో పోచయ్య, ఎస్జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు సీవోఈ విద్యార్థి



లక్ష్మీనరసింహాను సన్మానిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాల విద్యార్థి లక్ష్మీనరసింహా జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయి బాక్సింగ్‌పోటీలు జరిగాయి. పోటీల్లో అండర్–14 విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆయన్ను బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్, పీఈటీలు అల్లూరి వామన్, ఎం.రాజశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్



సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని రైతులకు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సోన్: రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ అన్నారు. మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో పసుపు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో పసుపు పంటపై గురువారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త మహేందర్‌తో కలిసి డీఏవో అంజిప్రసాద్ పాల్గొన్నారు. పసుపు సాగులో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి అన్నారు. అలాగే జిల్లా ఉద్యానవన అధికారి రమణ మాట్లాడుతూ పసుపు పంట కోసిన తర్వాత సరైన మార్కెటింగ్ పద్ధతులు అవలంభించి అధిక ధర పొందాలని సూచించారు.. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, సహజ పద్ధతిలో అధిక దిగుబడులను సాధించాలని పేర్కొన్నారు. అనంతరం నిజామాబాద్ జిల్లా జాక్రన్‌పెల్లి రైతు తిరుపతిరెడ్డి పాటల రూపంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. యూపీజ మేనేజర్ అపర్ణ, ఏవో వినోద్ కుమార్, హెచ్‌వో మౌనిక, ఏఈవోలు పాల్గొన్నారు.

30న కబడ్డీ ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 30న జిల్లా సీనియర్స్ మహిళా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 6 నుంచి 10వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే 71వ రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, ఫొటో, రిజిస్ట్రేషన్ రుసుంతో ఉదయం 10గంటలకు ప్రగతి మైదానంలోని పీఈటీ సదానందంకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. వివరాలకు 9849124856 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ముత్యంపల్లికి చెందిన బోడకుంట శ్యాంసుందర్ బుధవారం ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి బీరువాలో రూ.80వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదేగ్రామానికి చెందిన దాడి సాయితేజ దొంగతనం చేసినట్లు తేలింది. సోమగూడెం చౌరస్తాలో సాయితేజను గురువారం పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. దొంగిలించిన సొమ్ములో రూ.20 వేలతో సెల్‌ఫోన్ కొన్నాడని, రూ.29 వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మిగతా రూ.31వేల నగదు, సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కార్మికులకు గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 3, ఆర్కే 7 గనుల్లో జరిగిన బుధవారం రాత్రి షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఎస్సార్పీ 3 గనిలో కోల్‌కట్టర్ కార్మికుడు ఎన్.శ్రీనివాస్ రూఫ్‌కు డ్రెస్సింగ్ చేస్తుండగా చిన్న బొగ్గుపెళ్ల వచ్చి ఆయన కుడికంటి భాగంలో గుచ్చుకుంది. వెంటనే అతన్ని అధికారులు రామకృష్ణపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శస్త్రచికిత్స చేసి పెళ్ల ముక్కను తొలగించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా ఆర్కే 7 గనిలో గని లోపల షార్ట్‌ఫైరర్ కిరణ్‌దాస్ నీళ్లు తాగుతుండగా పైకప్పు నుంచి పై బొగ్గు పెళ్ల అతని వీపుపై పడింది. అధికారులు అతన్ని ఆర్కే 8 డిస్పెన్సరీకి తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు రాజునాయక్, నరేశ్ గురువారం ఇద్దరు క్షతగాత్రులను పరామర్శించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

ఖానాపూర్: అప్పుల బాధ, కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన కళ్యాణ్ గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. ఈవిషయాన్ని స్నేహితుడు పోలీసులకు సమాచారం అందించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది గ్రామానికి వెళ్లి బాధితుడికి ఫోన్‌లో ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో ఎస్సై రాహుల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎస్పీ జానకీ షర్మిలతో చర్చించి ఐటీ కోర్ సిబ్బంది తెలిపారు. బాధితుడి సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ పొలిమేరలో గుర్తించి వారి కుటుంబీకులకు అప్పగించారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. వ్యక్తిని కాపాడిన ఎస్సై, బ్లూకోల్ట్స్ సిబ్బంది సుధీర్, సంతోష్‌లను ఎస్పీ అభినందించారు.

అడవి పందిని హతమార్చిన ఇద్దరి అరెస్ట్

వేమనపల్లి: మండలంలోని ఒడ్డుగూడం శివారులోని మత్తడి వాగు వద్ద అడవి పందిని హతమార్చిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్ తెలిపారు. ఒడ్డుగూడం శివారు చేలలో ఆత్రం బాపు, కుడ్మెత లచ్చన్న అడవి పందిని హతమార్చి పోగులుగా ముక్కలు చేసి ఇంటికి తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా అటవీ అధికారులకు సమాచారం అందింది. ఎఫ్ఎస్ఓ బేగ్, బేస్‌క్యాంపు సిబ్బంది అక్కడికి వెళ్లి మాంసంతోపాటు నిందితులను అదుపులో తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలో అడవి పంది మాంసాన్ని ఖననం చేశారు.

దివ్యాంగుల క్రీడాపోటీల్లో ప్రతిభ



రాకేశ్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మంచిర్యాలకు చెందిన పాయిరాల రాకేశ్ క్యారం పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూప పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబర్చిన అతనికి అభినందనలు తెలిపారు.

భార్యాభర్తలను కలిపిన న్యాయవాదులు



జంటను కలిపిన న్యాయవాదులు

ఆసిఫాబాద్: గత ఐదేళ్లుగా విడివిడిగా ఉంటూ విడాకుల కోసం ఆసిఫాబాద్ కోర్టు చుట్టూ తిరుగుతున్న భార్యభర్తలను న్యాయవాదులు కలిపారు. వివరాల్లోకి వెళ్తే..కౌటాలకు చెందిన జాపర్తి సునీల్, అపర్ణలకు 2019లో వివాహమైంది. వివిధ కారణాలతో వేర్వేరుగా ఉంటున్న వీరు గతేడాది విడాకుల కోసం ఆసిఫాబాద్ కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. న్యాయవాదులు సతీశ్‌బాబు, కిశోర్‌కుమార్‌లు కేసు స్వీకరించారు. గురువారం ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిని ఒక్కటి చేశారు.

సొంతింటి కల నెరవేర్చాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని ఐఎన్టీయూసీ నాయకులు కోరారు. యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, యూనియన్ నాయకులు ధర్మపురి, సమ్మయ్య, జె.శంకర్‌రావు ఉన్నారు.

సినిమా ఆటోగ్రఫీ కోర్సుపై అవగాహన

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో న్యాక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సినిమా ఆటోగ్రఫీ కోర్సుపై గురువారం న్యాక్ ఏడీ నాగేంద్ర అవగాహన కల్పించారు. ఈ కోర్సుతో విద్యార్థులకు ఉపాధి లభిస్తుదన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు తెలంగాణ సినిమా చాంబర్ నంబర్ కార్డు లభిస్తుందన్నారు. నైపుణ్యం, ఉపాధి ఉండే కోర్సులపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ రమేశ్, జిల్లా న్యాక్ ఇన్‌చార్జి ధవంత్ రమేష్, అధ్యాపకులు శంకర్, సురేశ్, వెంకటపతిరాజు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు గెలుపొందాలి

మంచిర్యాలటౌన్: నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు గెలుపొందాలని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రం నుంచి ఆర్మూర్‌కు బయల్దేరి వెళ్తున్న జట్టు సభ్యులకు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్ రెడ్డి, కోచ్ సునర్కర్ అరవింద్, రెఫరీలు సాయి, రాజశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్టు: ఆసిఫాబాద్ నుంచి సత్యభామ, నందిని, అంజలి, కవిత, అనూష, శిరీష, పల్లవి, ఖుషి, రెబ్బెన నుంచి శిరీష, మందమర్రి నుంచి వైష్ణవి, జైపూర్ నుంచి హాసిని, లక్సెట్టిపేట్ నుంచి శృతి, శివాత్మిక, మౌనిక, ఆదిలాబాద్ నుంచి స్ఫూర్తి, సింధు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- డీడీఎంఎస్ ప్రేమ్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

శ్రీరాంపూర్: ప్రమాదాల నివారణకు పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బెల్లంపల్లి, రామగుండం రీజియన్ల రక్షణ అధికారులతో రక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా రక్షణలో వస్తున్న మార్పులు గమనిస్తూ పనిచేయాలన్నారు. రక్షణ నియమాలు అమలు చేస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా రక్షణ పనిముట్లు, పరికరాలు ఉపయోగించి పనిచేయాలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు, ఇతర ఏరియాలో రక్షణ అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

జన్నారం: ప్రతి ఒక్కరికి రాజ్యాంగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయవాది కృష్ణస్వరూప్ అన్నారు. మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ సదస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ అన్నివర్గాల కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు మహిళల కోసం చట్టాలు రూపొందించారన్నారు. దేశంలో రాజ్యాంగం మార్చే కుట్ర జరిగితే భవిష్యత్‌లో బానిస బతుకులవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుల రాజలింగం, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్ల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి అశోక్, నేతకాని మహార్ కుల సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జాడి సుధాకర్, రాష్ట్ర నాయకులు దుర్గం అమృతరావు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, హెచ్ఎం శివరాజం, ఉపాధ్యాయులు రాథోడ్ పిరాజీ, కరుణాకర్, సాయికుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

స్ట్రక్చరల్ సమావేశంలో పలు డిమాండ్లు అంగీకారం



పాల్గొన్న యాజమాన్యం, ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో చాలాకాలం తర్వాత గుర్తింపు సంఘం, యాజమాన్యం మధ్య స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. గురువారం కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్‌లో డైరెక్టర్(పా) లెవల్‌లో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ నేతలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు డిమాండ్లను యాజమాన్యం ముందు పెట్టారు. ఇందులో ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం అంగీకారం తెలిపిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్లు, టెక్నికల్ సూపర్‌వైజర్లు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారికి సూటబుల్ ఎంప్లాయిమెంట్ కల్పించడం, ట్రేడ్స్‌మెన్స్, ఈపీ ఆపరేటర్స్ సూటబుల్ ఎంప్లాయిమెంట్‌పై వచ్చేనెలలో జరిగే సీఎండీ లెవల్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. డిస్మిస్ అయిన జేఎంఈటీలను తిరిగి ఉద్యోగాల్లో తీసుకోవాలన్నారు. వేజ్‌బోర్డులో లేని 11 రకాల అలవెన్సు పెంపుదల, శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో ఓసీపీ, సీఎస్పీలకు వేర్వేరుగా ఇన్సెంటీవ్ అమలు, కొత్త ఇన్సెంటివ్ విధానంపై కమిటీ వేసి కమిటీ నిర్ణయం తదితర డిమాండ్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌తోపాటు కేంద్ర కమిటీ నాయకులు మిరియాల రంగయ్య, సారయ్య, వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వంగ వెంకట్, రాంగోపాల్ పాల్గొన్నారు.

నేడు కాగ్నిజెంట్ పరిశ్రమల సందర్శన

బాసర: ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ పరిశ్రమలను సందర్శించనున్నారు. అక్కడ ప్రముఖ ఐటీ కంపెనీల గురించి తెలుసుకోనున్నారని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, వివిధ విభాగాల అధిపతులు ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ విజయ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.